## నవతరం కోసం నవతరం రాసిన నవ్య కథ

''ఇంకాస్త అన్నం కలుపుకోండి. పచ్చడి బాగుందన్నారుగా''
ఆప్యాయంగా అన్నది అన్నపూర్ణ.
''వద్దు... వద్దు... బాగున్నది అంటే ఇంకాస్త కావాలని కాదు.... హలో! చెప్పరా... నిన్ను కాదులే... మధ్యలో మా ఆవిడ అన్నం ఎక్కువ తినమంటుంటేనూ....''

..........

''నిజమే గానీ.... పొట్ట పట్టాలి కదరా.. సరే గానీ రెజింగ్‌లో వుంటుందనుకున్నప్పుడు ఇంకో నాలుగయిదు వందలు ఎక్కువ తీసుకుని వుండాల్సింది.''

............

# ఆమె తీర్పు

## పెనుమాక నాగేశ్వరరావు

''సరే అయిపోయిందిగా...... ఈ సారికి ఇంతే అనుకుందాం అంటావ్ నువ్వు.. ఓకే.. ఓకే.. వుంటా మరి'' మిత్రుడు సుధాకర్‌తో ఫోను సంభాషణకు స్వస్తి చెప్పి

''కాసిని మజ్జిగ పొయ్యవోయ్ పూర్ణా'' అడిగాడు రవి భార్యను.

''అప్పుడే మజ్జిగేంటి, సాంబారు చేశా.. పోసుకోండి''

''ఇంక నా వల్లకాదు.. మజ్జిగ పోసేయ్''

''మీరు అన్నం తినేటప్పుడు కూడా ఆ సెల్లు వదలక పోతే కుదర్దు చెప్తున్నా. రేపట్నుంచి దాన్ని స్విచ్ ఆఫ్ చేసి మరీ అన్నానికి కూర్చోండి'' చిరుకోపం చూపింది అన్నపూర్ణ.

అన్నపూర్ణ పేరుకు తగిన మనిషి. వంటలోనూ, వడ్డనలోనూ ఆరితేరిన ఇల్లాలు. అంతే కాదు ఎవరికైనా కొసరి కొసరి వడ్డించి తినిపిస్తుంది. కొత్త కొత్త రుచుల్తో శ్రద్ధగా, ఆసక్తిగా అనుపాకాన్ని తయారు చేస్తుంది. తినే వారు పదార్థాలు రుచి, పాకాల గురించి మెచ్చుకుంటే మురిసిపోయే అల్ప సంతోషి. అలాంటిది భర్త రుచుల్ని, అభిరుచుల్ని ఆకళింపు చేసుకొని అతనికి హితవైన పదార్థాన్ని రుచికరంగా చేసి ఆప్యాయంగా తినిపించి సంతృప్తిపడిపోతుంది అన్నపూర్ణ.

రవిచంద్ర కూడా భార్య మనసెరిగి ప్రవర్తించే మనిషి. ఆమె తన పట్ల చూపే ప్రేమకు గర్వం కలుగుతుంది. అంత మంచి భార్య దొరికినందుకు తనకు తనే అభినందించుకుంటుంటారు. అయిదు అంకెల జీతం, సొంత ఇల్లు, ఇంపుగా ఇద్దరు పిల్లలు, ద్విచక్ర వాహనం, అధునాతన సౌకర్యాలు, పరికరాలు అన్నీ సమకూర్చుకున్న సునాయస, సుఖమయ జీవితం కొనసాగిస్తున్న కుటుంబం వారిది.


అయితే ఇటీవలి కాలంలో, పెరిగిపోతున్న, పెచ్చురిల్లి పోతున్న డబ్బు పిచ్చి, డబ్బులు పోగేసుకునే పోరాటం, ఆరాటం రవిచంద్రను కూడా పట్టుకున్నది. అన్నం కాదు, నిద్ర లేదు. ఆకలి కాదు, విశ్రాంతి లేదు. ఇరవైనాలుగు గంటలూ ఒకటే ఆసక్తి. ఒకే ఆలోచన. ఆయనతో పాటు, చేతిలో వుండే సెల్‌ఫోనుకూ విసుగూ, విరమం లేవు. ఫోనుకైనా రీఛార్జి సమయంలో కాస్తంత ఆటవిడుపు దొరుకుతుంది గానీ అతగాడికి ఆ మాత్రపు వెసులుబాటు కూడా లేదు.

ఇంట్లో వున్నా, ఆఫీసులో వున్నా, అర్థ రాత్రి అయినా, పట్టపగలైనా, ఎప్పుడు ఒకటే ధ్యాస. షేర్లు.....షేర్లు..షేర్లు... అమ్మటాలు, కొనడం, లెక్కలు, కాలిక్యులేటర్సు, చెక్కులు, బ్యాంకులు, పేపర్లు, పుస్తకాలు. అదే ప్రపపంచం. అదే గోల. అన్నం, నీళ్లే పట్టని మనిషికి ఆలు బిడ్డలు పడతారా! పట్టించుకుంటాడా! ఈ పరిణామం ఎటు దారి

తీస్తుందోనన్న భయం పట్టుకుంది అన్నపూర్ణకు. మొదట్లో అనునయంగా చెప్పి చూసింది. లాభం లేకపోయింది. అతని ఆరాటం ఆమెకు ఆందోళన కలగజేయ సాగింది. ఎలా చెప్పినా, ఎంత చెప్పినా అతడు వినిపించుకునే స్థితిలో లేడని అర్థమైపోయిందామెకు.

''పిచ్చి ముఖమా, దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం అంటే ఇదేనే. ఒంట్లో ఓపిక ఉండగానే నాలుగు రాళ్లు వెనకేసుకోక పోతే రేపు ఏ అవసరానికీ ఎవ్వడూ ఆదుకోడు. పిల్లలు పెద్ద వాళ్లు అవుతున్నారు. ఖర్చులు పెరిగి పోతున్నాయి. అవసరాలు పెరిగిపోతున్నాయ్. విలాసాలన్నీ సౌకర్యాలు గానూ, సౌకర్యాలన్నీ అవసరాలుగానూ మారి పోతున్నాయ్. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయ్. అయినా డిమాండ్ తగ్గడం లేదు. అందరూ అన్నీ కొంటు న్నారు. ఈ పోటీలో తట్టుకోవాలంటే డబ్బుండాలి'' ఇదీ ఆమెతో అతడి వాదన.

''మీరు ఎన్నన్నా చెప్పండి. దేనికయినా అతి కూడదు. శృతి మించకూడదు. మితిమీరకూడదు. అతి, అనర్థాలకి మూల మండి. తృప్తికి మించిన ధనం లేదు. ఆరోగ్యమే మహాభాగ్యం. దాన్ని నిర్లక్ష్యం చేసి డబ్బులు ఎంత పోగేసుకుంటే మాత్రం ఏమిటి ప్రయోజనం? ''హాయిగా వున్నాం. ఆనందంగా గడిచి పోతున్నది. అత్యాశకు పోయి, నిద్రాహారాలు మానేసి అదే పిచ్చిగా ఏ పనీ చేయకూడదు. డబ్బు పోగేసుకు నేందుకయితే అసలే కూడదు. అంతే కాదు, రేపు పిల్లలకు, ఎల్లుండి మన పిల్లల పిల్లలకు అనుకుంటూ పోగేసుకోవడానికి ఆరాటపడితే ఇవ్వాళ మనకు సుఖం వుండదండీ. సంపాదించండి.. వద్దనడంలా. అంతు ఎక్కడా అని. అదొక్కటే ఆలోచించుకుని మరే పనైనా చేయండి అదొక్కటే నే చెప్పేది'' ఇది అన్నపూర్ణ ప్రతి వాదన.



ఆమె ప్రతి వాదన, తన పతిదేవుణ్ని ఏ మాత్రం మార్చలేకపోయింది.

''అన్నపూర్ణా నువ్వొట్టి పిచ్చిదానివి గానీ కొన్నాళ్లు అలా చూస్తూ వుండు'' అని తేలిగ్గా తన మాటల్ని కొట్టి పారేసే భర్తని వారించ లేకపోయింది. అతన్తో వాదించ లేకపోయింది అన్నపూర్ణ.

''రోజులు గడిచిన కొద్దీ ఆయన ఇంట్లో వుండే సమయం తగ్గిపోతున్నది. ఆ కాస్త టైములో పిల్లల్తో నాతో మాట్లాడే అవకాశం అసలే వుండడం లేదు. ఆ కాసేపు కూడా సెల్‌ఫోను చెవిలో పెట్టుకొని ఎవరెవర్తో ఏదో లావాదేవీలు మాట్లాడడం ఇదే సరిపోతున్నది. ఎలా ఈయన్ని మార్చడం అని తనలో తనే అంతర్మథనం పడసాగింది అన్నపూర్ణ.

కొద్ది రోజుల్లోనే భార్య ఒంటి నిండా నగలు చేయించాడు రవిచంద్ర. కొత్త ఫర్నీచరు, కొత్త ఫ్రిజ్, కొత్త టీవీ, అన్నీ కొన్నారు. అవేవీ ఆమెకు ఆనందాన్ని ఇవ్వలేకపోయినై. ఆ

విషయాన్ని అతడు గ్రహించినా, జీర్ణించుకోలేక పోయాడు. తన మార్గాన్ని మార్చుకోలేక పోయాడు. కొత్త కోరికలు, కొత్త అలవాట్లు, కొత్త స్నేహాలు, వేళ కాని వేళల్లో ఇంటికి చేరడం. ఇంట్లో మనుషుల్ని పట్టించుకోక పోవడం. పిల్లలిద్దరూ తండ్రి ప్రేమకు దూరమవుతున్నారు. అన్నపూర్ణలో కూడా అసంతృప్తి, నిర్లిప్తత చోటుచేసుకున్నాయి. ఇద్దరి మధ్యన ఇదివరకటి అన్యోన్యత, ఆత్మీయతల్లో తెలియని వెలితి కన్పించ సాగింది ఆమెకు. చివరకు తమ ఆరోగ్యం పట్ల కూడా భర్త శ్రద్ధ కనపరచక పోవడం మరింత బాధకు గురిచేసింది అన్నపూర్ణను.

''మేం చచ్చినా, బతికినా మీకేం పట్టేటట్లు లేదు. ఇంకెందుకు మా ముగ్గురికీ కాస్తంత విషం తెచ్చివ్వండి. ఇక మీకు ఏ అడ్డూ వుండదూ. మీ ఇష్టం వచ్చినట్లు వూరేగండి'' అంటూ ఆవేశ పడిందో రోజున అన్నపూర్ణ.

భార్యలో అంతటి ఆవేశాన్ని అంతకు ముందు ఎన్నడూ చూసి ఎరుగడు రవిచంద్ర. ఆమె కోపాన్ని చూసి కాస్తంత చలించిపోయాడతను. ఎక్కడో దాగి వున్న మానవత్వం మేల్కొంది. ఆప్యాయత తన్నుకు వచ్చింది.

''మీ అందర్నీ సుఖపెట్టాలనీ, మీకు కష్టం తెలియకుండా, కాలం గడిపేట్లు చేయాలనీ, నేను ఆరాటపడుతున్నానే కానీ నా ఒక్కడి కోసం కాదుగా అన్నపూర్ణా. పిల్లలకు మంచి చదువు చెప్పించాలన్నా, రేపు వాళ్ళకి డొనేషన్లు, ఫీజులు కట్టి పేరొందిన కాలేజీల్లో చేర్పించాలన్నా ఎంత డబ్బు కావాలో తెల్సా! మన ఇంటికి ఎయిర్ కండిషన్ మిషన్ పెట్టించాలనుకుంటున్నాను. నెలకి కరెంటు బిల్లు ఎంతవుతుందో తెల్సా? మరి నిజానికి త్వరలో ఓ కారు కొనాలనుకుంటున్నాను. పెట్రోలు ఖరీదు ఎలా పెరిగి పోతుందో తెలుసుగా?'' చెప్పుకుపోసాగాడు రవిచంద్ర.

''సర్సరే... మీ దారికి నే అడ్డురాదల్చుకోలేదు. కానీ ఒక్క విషయం నిజాయితీగా చెప్తే సంతోషిస్తాను. అడగనా?'' స్థిరంగా అడిగింది.

''అడుగు''

''ఎంత...మీ లక్ష్యం? ఎంత సంపాదించి ఆగిపోవా లనుకుంటున్నారు? ఇప్పటికి ఎంతయ్యింది? ఇంకెంత సంపాదించాలి? దానికి ఎంత కాలం పట్టవచ్చును కుటుంన్నారు?''

పెద్దగా నవ్వేడు రవిచంద్ర. భార్య ముఖం సీరియస్‌గా వుండడం గమనించి, నవ్వుకు స్వస్తి చెప్పాడు. ''చూడు పూర్ణా, పసిపిల్లలా మాట్లాడు తున్నావ్? డబ్బు సంపాదనకు టార్గెట్లు, లక్ష్యాలూ వగైరాలుండవోయ్. కలిసొచ్చినంత కాలం సాగి స్తుండడమే!''

''సరే, అయితే నే చెప్పేది కూడా వినండి. మీలాంటి వాళ్లు వర్తమానాన్ని వదలేసి, రాబోయే కాలంలో మనం సుఖపడిపోవాలి, మిగిలిన అందరూ కరువు కాటకాల్తో మాడి ఛస్తున్నా మనకా దురవస్థ పట్టకుండా రాజభోగాల్ని అనుభవించు కోవాలన్న కోరికతో డబ్బు పోగేసుకునే పిచ్చిలో పడి ఇప్పుడు సుఖపడడం చేతకాక, అప్పటికి సుఖపడే వయసుడిగి రెంటికీ చెడ్డ చేవడిలా అయిపోతారు. గతంలో అనుభవించిన వారంతా ఈ విషయాన్ని వివరంగా రకరకాలుగా చెప్పారు. అయినా ఇక మిమ్మల్ని వారించడం, మీతో వాదించడం అనవసరం అని తెలిసిపోయింది.''

''వెరీగుడ్...వెరీగుడ్'' భార్య మాటల్ని మధ్యలోనే ఆపి అన్నాడు రవిచంద్ర.

''గుడ్డో...బ్యాడో తరువాత గాని తెలియదులే కానీ ఇంకో ముఖ్యమైన విషయం గూడా వినండి.''

''చెప్పండి''

''మీకు ఇప్పుడు ఇల్లు, పెళ్లాం, పిల్లలు ఏవీ పట్టడం లేదు. డబ్బు...డబ్బు...డబ్బు నేనేం వద్దనడం లేదు. మీరు డబ్బు పోగేసే వ్యసనంలో పడి మిగిలిన వాటినన్నింటిని విస్మరిస్తున్నారు. వాటి పైకి మీ మనసు వెళ్లడం లేదు. సిగ్గు విడిచి చెప్పాలంటే నా శరీరం పైకి కూడా మీ మనసు మళ్లనంత మైకంలో మునిగిపోయారు.''

నాకు, మీరు నా పట్ల, పిల్లల పట్ల శ్రద్ధ చూపుతున్నానే తృప్తి కావాలి. దాన్లోని ఆనందం కావాలి. నాతో కబుర్లు చెప్తూ, కష్ట సుఖాల్ని స్వేచ్ఛగా మాట్లాడుకోవడంలోని మాధుర్యం కావాలి. మీరు తృప్తిగా భోజనం చేయడం చూసి నేను తృప్తి పడాలి. వీటన్నిటితో పాటు నా శరీరానిక్కూడా మీరు ఇదివరలో అందించిన అనుభూతులు కావాలి. కానీ మీరు వీటన్నింటి పైనా దృష్టి పెట్టలేని ఓ వ్యాపకంలో, వ్యసనంలో మునిగితేలుతున్నారు.

అందుకే వీటన్నిటిపైకి మనసు మళ్లి అసంతృప్తికి లోనే కాకుండా వుండడానికి నేనూ ఓ వ్యాపకాన్ని వెతుక్కుంటాను. అది డబ్బు ఖర్చు పెట్టేదీ కావచ్చు. లేదా మీలా డబ్బు సంపాదించేదీ కావచ్చు. అలా నేనూ ఓ వ్యాపకం వెతుక్కుంటాను. నా దారికి మీరూ అడ్డు రావద్దు.''

భార్య మాటలకు అవాక్కయిన రవిచంద్ర అలా శూన్యంలోకి చూస్తూండిపోయాడు.

అనతి కాలంలోనే తనూ ఓ వ్యాపకాన్ని వెతుక్కున్నది అన్నపూర్ణ

★

